సాక్షి
జోగుళాంబ గద్వాల

సోమవారం ၊ 17 ၊ ఫిబ్రవరి ၊ 2025



పోరాటంతోనే రాజ్యాధికారం

పోరాటంతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

వివరాలు 8లో ▸



పెట్టుబడిదారుల చేతుల్లోనే..

దేశ సంపద పెట్టుబడిదారుల చేతుల్లో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.5 /12.6

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి వేళల్లో చలిగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అలరించిన పద్యనాటక ప్రదర్శనలు



స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక పద్యనాటక ప్రదర్శనలు ఆదివారం రెండోరోజు కొనసాగాయి. కోయిలకొండ మండలం అంకిళ్ల గ్రామానికి చెందిన రామాంజనేయ కళానాట్య మండలి కళాకారులు శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టం, శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో దేవేంద్ర సభ, శ్రీకృష్ణ రాయబారం, మిడ్జిల్ మండలం మల్లాపూర్‌కు చెందిన శ్రీవీరాంజనేయస్వామి నాట్య మండలి ఆధ్వర్యంలో కౌరవసభ, కళాకారుడు ఎ.శ్రీశైలం రావణ ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళానాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ మాట్లాడుతూ మన్యంకొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సహకారంతో మంగళవారం వరకు పద్యనాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పద్యనాటక ప్రదర్శనలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. సోమవారం వివిధ సంస్థలచే శ్రీకృష్ణాంజనేయ యుద్ధ ఘట్టం, మయసభ దుర్యోధన నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

పోటెత్తిన వేరుశనగ

నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు ఆదివారం వేరుశనగ పోటెత్తింది. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఆదివారం మార్కెట్‌కు ఒక్కసారిగా 10,071 బస్తాల వేరుశనగ తీసుకువచ్చారు. అయితే క్వింటాల్ గరిష్టంగా రూ.6,960, కనిష్టంగా రూ.4,884 ధర వచ్చిందని మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఎవరికైనా ఇబ్బందులు కలిగితే వెంటనే వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేయాలని చైర్మన్ లింగం రైతులకు సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోవడం వల్లే ఉద్యోగులంతా ఏకమై రాష్ట్రంలో ప్రభుత్వ మార్పునకు శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్‌సీ నివేదికను ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని కోరారు. గత రెండేళ్లగా ఈ-కుబేర్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు (ఫైల్)

అక్రమం.. పలుకుబడితో సక్రమం

అదును చూసి పూర్తిచేసి..

జిల్లా కేంద్రంలోని 6వ వార్డు పరిధిలోని బసవన్న చౌరస్తా క్రాస్‌రోడ్డులో ప్రజా అవసరాల కోసం వదిలిన పది శాతం మున్సిపల్ స్థలంలో అక్రమంగా వాణిజ్య దుకాణ నిర్మాణాలను చేపట్టారు. గతంలో ఇదే స్థలంలో నిర్మాణాలు చేపడితే అప్పటి మున్సిపల్ అధికారులు అక్రమమని తేల్చి కూల్చివేశారు. తర్వాత చాలాకాలం పాటు నిర్మాణాల జోలికి వెళ్లలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అధికార యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో ఉండటాన్ని గమనించి, ఇదే అదనుగా మళ్లీ వాణిజ్య దుకాణ నిర్మాణాలు చేపట్టారు. అప్పుడు కూడా స్థానికులు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పనులను నిలిపివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కొద్దిపాటి పనులతో దుకాణ నిర్మాణాలు పూర్తయ్యాయి. తాజాగా కబ్జాదారుడు కొంతమంది నాయకులకు ముడుపులు చెల్లించి, రెండు రోజుల క్రితం దర్జాగా దుకాణాలను పూర్తిచేశాడనే ఆరోపణలు ఉన్నాయి.

'జిల్లా కేంద్రంతోపాటు అయిజ పట్టణంలో అనుమతి లేని కట్టడాలు, అక్రమ నిర్మాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరఢా ఝులిపించారు. ఇళ్ల నిర్మాణాలతోపాటు ప్రజా అవసరాల కోసం వదిలిన పది శాతం స్థలంలో పలు సామాజిక వర్గాలకు చెందిన కట్టడాలను అక్రమ నిర్మాణాలు అని నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. ఎలాంటి సానుభూతి చూపించకుండా చర్యలు తీసుకున్నారు..' ఇదీ మూడేళ్ల క్రితం మాట.

ప్రస్తుతానికి వచ్చేసరికి.. 'జిల్లా కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా చాలా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. ప్రజా అవసరాల స్థలంలో సైతం యేథేచ్ఛగా ఇళ్లు, వాణిజ్య దుకాణాలను చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఒక్కొక్కరిపై ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారు. పలుకుబడి ఉన్న వాటిపై టాస్క్‌ఫోర్స్ బృందం స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.'

- అక్రమ నిర్మాణాల కూల్చివేతలో అధికారుల పక్షపాత వైఖరి
- ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణం
- అధికారులకు మొర పెట్టుకున్నా.. చర్యలు శూన్యం
- కనిపించని 'ప్రత్యేక' మార్క్



6వ వార్డు పరిధిలోని బసవన్న చౌరస్తాలో పది శాతం మున్సిపల్ స్థలంలో అక్రమంగా చేపట్టిన వాణిజ్య దుకాణాలు

గద్వాల టౌన్: జిల్లాలో గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడమే టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యం. అక్రమ నిర్మాణాల విషయంలో ఉన్నతాధికారులు రాజకీయ పలుకుబడి ఉన్న వారికి ఓ విధంగా.. సామాన్యుల నిర్మాణాల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రజలు అధికారుల తీరును ఎండగడుతున్నారు.

నిబంధనలు అతిక్రమించి..

అందరూ టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకుని నేరుగా అనుమతులు పొందిన తర్వాతే ఇంటి నిర్మాణాలు చేపట్టాలి. కానీ చాలా మంది అవగాహనలేమితో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరూ తెలిసి కూడా అనుమతులు తీసుకోకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ తరహాలో నిర్మించే అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో గత ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇది అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలి. కానీ గద్వాల, అయిజ పట్టణాలలో నిర్మాణాలు సక్రమంగా జరగడం లేదు. అందుకు ప్రధాన కారణం రాజకీయ ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల పైరవీలతో అసలు లక్ష్యం పక్కదారి పడుతోంది. ప్రధానంగా గద్వాల, అయిజ మున్సిపల్ పరిధిలో పెద్ద సంఖ్యలో అనుమతి లేని నిర్మాణాలు జరుగుతున్నా.. వాటి గురించి అధికారులకు తెలిసిన పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతి లేని కట్టడాల గురించి ప్రారంభ దశలోనే ఫిర్యాదు చేసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నాయి. గత మూడేళ్ల నుంచి అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నా... చర్యలు తీసుకోవడం లేదు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం



అక్రమ నిర్మాణాలు, మున్సిపల్ స్థలాల కబ్జాపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి, అట్టి నిర్మాణ పనులను నిలిపివేశాం. మిగిలిన స్థలాలపైనా విచారణ చేసి.. వాటి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం . అక్రమ నిర్మాణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– నర్సింగరావు, అడిషినల్ కలెక్టర్.

'ప్రత్యేక పాలన'పై పెదవి విరుపు

మున్సిపల్ పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. అయితే, ప్రత్యేక పాలనలో అక్రమాలు ఉండవని, పారదర్శక పాలన లభిస్తుందని, సమస్యలు తొలిగి న్యాయం జరుగుతుందని ప్రజలు భావించారు. అయితే ఆ దిశగా ప్రత్యేక పాలన సాగడం లేదని పెదవి విరుస్తున్నారు. ఇటీవల స్థానిక 34వ వార్డు పరిధిలోని కుంటవీధిలో, 6వ వార్డు బసవన్న చౌరస్తా ఎదురుగా ఉన్న పది శాతం మున్సిపల్ స్థలంలో చేపట్టిన నిర్మాణాలు వివాదాస్పదమయ్యాయి. ఈ అక్రమ నిర్మాణాలపై కలెక్టర్, అడిషినల్ కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినా.. ఇప్పటి వరకు చర్యలు లేవు. రాజకీయ ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు ఆ నిర్మాణ చాయలకు కూడా వెళ్లడం లేదు. పైగా వెళ్లిన కింద స్థాయి సిబ్బందిపై విరుచకపడుతున్నారు. 'మా అన్నతో మీ సార్‌కు చెప్పించాం కదా.. మళ్లీ ఎందుకు వచ్చావ్' అంటూ సిబ్బందిపై రుబాబు ప్రదర్శించారు. రాజకీయ అండతో ఆక్రమణదారుడు బరితెగించి నిర్మాణాల వేగాన్ని మరింత పెంచి అధికారులకే సవాల్ విసురుతున్నాడు. వీటిపై అధికారులు ఏవిధంగా స్పందిస్తారో అనే దానిపై స్థానికుల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలు, ఆస్తిపన్ను మదింపులో పెద్ద ఎత్తున్న అవినీతి జరుగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అధికారులపై ఉంది.

- 2024 మే 23న వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి(50) దారుణ హత్యకు గురయ్యాడు. ఇంటి వద్ద రాత్రి భోజనం చేసిన అనంతరం కల్లం వద్ద మంచంలో నిద్రించిన వ్యక్తిపై అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి హతమార్చారు. రాజకీయంగానూ సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితులను ఏడాది గడుస్తున్నా పోలీసులు ఇప్పటికీ పట్టుకోలేదు.
- జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం భైరాపురం శివారులో ఉన్న రైల్వేస్టేషన్ సమీపంలో గత డిసెంబర్ 21న ఓ గుర్తుతెలియని వ్యక్తి(60) మృతదేహం లభ్యమైంది. అతని శరీరంపై, తలభాగంలో తీవ్రమైన గాయాలు ఉండటంతో హత్య చేసినట్టుగా పోలీసులు భావించారు. అయితే ఇప్పటి వరకు హత్యకు పాల్పడిన వారిని మాత్రం గుర్తించలేకపోయారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లోనూ హత్య కేసుల ఛేదనకు ఏళ్లపాటు సమయం పడుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని నాగనూలు రోడ్డులో గురువారం ఉయ్యాలవాడకు చెందిన శాంతమ్మ(55) రోడ్డుపైనే హత్యకు గురైంది. ఆమెను అత్యాచారం చేసిన అనంతరం హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే ఇందుకు గల కారకులెవరో మాత్రం గుర్తించలేదు. అలాగే ఇటీవల బిజినేపల్లిలోని పాత ఎంపీడీఓ కార్యాలయం నిప్పులో తగులబడి, అందులో ఉన్న యాదగిరి అనే వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. అయితే ఎవరైనా హత్య చేశారా.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా.. అన్నది పోలీసులు ఇంకా తేల్చాల్సి ఉంది.

వీడని మిస్టరీ

- ఏళ్లు గడుస్తున్నా హత్య కేసుల్లో దోషులను గుర్తించని పోలీసులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లోనే పలు మర్డర్ కేసులు
- రాజకీయంగా సంచలనం సృష్టించినవి సైతం అదే తీరు
- రెండు, మూడు రోజుల్లో దొరక్కుంటే అంతే సంగతులు..
- ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నా ఛేదించడంలో విఫలం



సాక్షి, నాగర్‌కర్నూల్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చి నేర పరిశోధన, కేసుల ఛేదింపుల్లో పోలీసులకు ఆయుధంగా మారుతోంది. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు, ఫోరెన్సిక్ ఆధారాల సాయంతో హత్య కేసులను ఛేదించడం సులభతరం అవుతోంది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చోటుచేసుకున్న కొన్ని హత్యకేసుల్లో నిందితులు మాత్రం పోలీసులకు చిక్కడం లేదు. మరి కొన్ని కేసుల విచారణ ఏళ్లతరబడిగా కొనసాగుతోంది. చాలా సందర్భాల్లో రెండు, మూడు రోజుల్లో నిందితులు పట్టుబడకపోతే ఆ కేసు పెండింగ్‌లో పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో సంచలనం కలిగించిన హత్య కేసుల్లోనూ నిందితులను గుర్తించలేకపోవడం పోలీసుల పనితీరుకు మచ్చగా నిలుస్తోంది.

నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లోనే ఎక్కువ

గతేడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 33 హత్యలు చోటుచేసుకున్నాయి. జిల్లాలోని బిజినేపల్లి, నాగర్‌కర్నూల్ మండలాల్లో ఎక్కువగా నేరాలు నమోదయ్యాయి. ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో 30 హత్యలు జరిగాయి. ఆ తర్వాత వనపర్తిలో 14, జోగుళాంబ గద్వాలలో 9, నారాయణపేట జిల్లాలో 8 హత్య కేసులు నమోదయ్యాయి.

విచారణ కొనసాగుతోంది..

చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో వ్యక్తి హత్య కేసుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఇంకా నిందితులను గుర్తించలేదు. ఈ కేసు మినహా ఎక్కడా మర్డర్ కేసులు పెండింగ్‌లో లేవు. ఎప్పటికప్పుడు పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– వెంకటేశ్వరరావు, డీఎస్పీ, వనపర్తి



నాగర్‌కర్నూల్‌లోని నాగనూలు రోడ్డులో హత్యకు గురైన మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో గతేడాది నమోదైన హత్య కేసుల వివరాలు..

నాగర్‌కర్నూల్	33
మహబూబ్‌నగర్	30
వనపర్తి	14
జోగుళాంబ గద్వాల	09
నారాయణపేట	08

ఎండుమిర్చి ఏడిపిస్తోంది..!

ధర లేక సతమతమవుతున్న రైతులు

- గతేడాది క్వింటా రూ.20వేలు పలికిన వైనం
- ప్రస్తుత సీజన్‌లో రూ.10వేల దిగువకు..
- పెరిగిన కూలీ, కౌలు ఖర్చులతో అప్పుల ఉబ్బిలో అన్నదాతలు



చెన్నిపాడులో కల్లంలో ఉంచిన ఎండు మిర్చి పంట

మానవపాడు: ఎన్నో ఆశలతో ఎండుమిర్చి సాగు చేసిన రైతుకు అటు ధరలు లేక.. ఇటు దిగుబడి తగ్గి నష్టాలు వెంటాడుతున్నాయి. వర్షాభావం, చీడపీడలు తట్టుకొని.. పెట్టుబడి వ్యయం పెరిగినా భరించి పంటను పండిస్తే నిరాశే ఎదురవుతుంది. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటా రూ.20వేలు పలకగా.. ప్రస్తుత సీజన్‌లో రూ.7వేల నుంచి రూ.11,500 వరకు మార్కెట్ రేటు పలుకుతుండడంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. జిల్లాలో ఈ సీజన్‌లో దాదాపు 37వేల ఎకరాల్లో ఎండుమిర్చి సాగు చేశారు.

ధరల పతనం

గతేడాది ఎండుమిర్చికి మంచి ధర పలికింది. క్వింటా మిర్చి రూ. 20వేల వరకు పలికింది. కొంతమంది మరింత ఎక్కువ ధర వస్తుందని ఆశతో కోల్డ్‌స్టోరేజీలో మిర్చిని దాచారు. అయితే, గత సీజన్ నుంచి ఈ సీజన్ వరకు సుమారు 50శాతం ధరలు పడిపోవడం గమనార్హం. దిగుబడులు తగ్గటంతో పాటు ధరలు కూడా పతనం కావడంతో మిర్చి రైతులు దిక్కుతోచని స్థితిలో చేరుకున్నాడు. కోల్డ్‌స్టోరేజీలో బస్తాకు ఏడాదికి రూ.170 నుంచి రూ.200 వరకు వసూలు చేశారు. తేజ రకం మిర్చి కొత కూలీ క్వింటాకు రూ.3 వేల వరకు ఖర్చుఅవుతుంది. దీనికితోడు పెటుబడి ఖర్చులు కలుపుకొంటే దాదాపు రూ.7వేల వరకు ఖర్చు వస్తుంది. వర్షాల కారణంగా కాయల్లో నాణ్యత లోపించింది. నాణ్యత తక్కువగా ఉందని ధరలు తక్కువ ఇస్తుండడంతో రైతు అవస్థలు పడుతున్నారు.

పెరిగిన అప్పులు

మిర్చి సాగుకు ఈ ఏడాది ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు కూలి ధరలు అమాంతం పెరిగాయి. ఎకరా సాగుకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల దాకా ఖర్చు చేయగా.. దిగుబడి మాత్రం 7 నుంచి 12 క్వింటాళ్ల లోపే వచ్చిందని పేర్కొన్నారు. గత ఏడాది ఈ సీజన్‌లో గుంటూరు మిర్చి రకం క్వింటాకు రూ.14 వేల నుంచి రూ.20వేల దాకా ధర పలికింది. సింజేంటా, బ్యాడిగ, రకం రూ.18వేల నుంచి రూ.30వేలు, సూపర్ 10, గుంటూరు మిర్చి రకాలు రూ.14వేల నుంచి రూ.22వేల వరకు ధర ఉండగా.. నేడు దాదాపు 50 శాతానికి తగ్గిపోయాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మద్దతు ధర వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరిత్యాలు వల్ల రైతులు నష్టపోతే ప్రభుత్వాలు ఎంతో కొంత ఆదుకునేవని, అలాగే ఈ ఏడాది ఎండుమిర్చి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా వివరాలిలా..

మండలం	సాగు (ఎకరాల్లో)
ఇటిక్యాల	8,368
మానవపాడు	5,759
గద్వాల	4,361
అయిజ	4,301
గట్టు	3,153
మల్దకల్	2,869
ఉండవెల్లి	2,771
రాజోలి	795
వడ్డేపల్లి	783
అలంపూర్	683
ధరూరు	131
కేటీదొడ్డి	99

ఎలా బతికేది.. ?



10ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. పంటకొలు, మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ. 2లక్షల వరకు ఖర్చు అయ్యింది. కానీ, దిగుబడి మాత్రం రాలేదు. 10 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే మిర్చి దిగుబడి వస్తోంది. నాణ్యతను బట్టి రూ.7వేల నుంచి రూ.12వేలు ధర ఇస్తే మేం ఎలా బతికేది.

– రామాంజనేయులు, రైతు, చెన్నిపాడు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎండు మిర్చి పంట సాగుకు రూ.లక్షలు ఖర్చు చేశాం. ఇప్పుడేమో ధరలు లేక అప్పులు పేరుకుపోయే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో మిర్చికి రూ.10వేలకు తక్కువగానే ధర పలుకుతోంది. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావు. రాష్ట్ర ప్రభుత్వం ఎండు మిర్చికి మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, రైతు, గోకులపాడు

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కోడేరు గురుకుల పాఠశాలలో డార్మెటరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో రూ.25 లక్షలతో నిర్మించే టాయిలెట్స్, డార్మెటరీ, డైనింగ్ హాల్, కస్తూర్బా విద్యాలయంలో రూ.10 లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదులు, కొండ్రావుపల్లిలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, జనుంపల్లిలో రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతు భరోసా పథకాలు అమలు చేసిందన్నారు. త్వరలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని.. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని.. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. అనంతరం మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ రావు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ కరీం, బావాయిపల్లి మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌యాదవ్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు, ఆది రాజు, రామకృష్ణ, పాండేళ్ల సురేశ్, ఇమ్రాన్, బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడు బలవన్మరణం


మల్లేష్(ఫైల్)

అడ్డాకుల: ఉరేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని సుంకరామయ్యపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆకులమున్ని పెద్దకొండన్న, అలివేల దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమారుడు ఆకులమున్ని మల్లేష్(21) హైదరాబాద్‌లో ఎలక్ట్రిషియన్ పని నేర్చుకునేవాడు. రెండు నెలల క్రితం ఊరికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఎలక్ట్రిషియన్ పని చేయడంతో పాటు అప్పుడప్పుడు మేకలు కాసేవాడు. ఇదిలా ఉండగా పెద్ద కుమారుడు నరేష్‌తో కలిసి తల్లిదండ్రులు శ్రీశైలం దేవస్థానానికి వెళ్లారు. ఇంటి వద్దే ఉన్న మల్లేష్ ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా గమనించిన స్థానికులు ఇంటి తలుపులు పగులకొట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మల్లేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. శ్రీశైలంలో ఉన్న తల్లిదండ్రులకు బంధువులు సమాచారం అందించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మన్ననూర్‌లో మరొకరు..

మన్ననూర్: మండల కేంద్రం శివారులోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనున్న దర్గా సమీపంలో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ రజిత వివరాల మేరకు.. బల్మూర్ మండల కేంద్రానికి చెందిన ఎండీ జాంగీర్ (25) ఇంట్లో ఈ నెల 9న జరిగిన చిన్న సంఘటనతో కలతచెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బల్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మన్ననూర్ సమీపంలోని దర్గా వెనక భాగంలో ఓ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించిన అటవీశాఖ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున గద్వాల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి(31) రైలుపట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి వివరాల కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మిడ్జిల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రాఘవేందర్ (26) బైక్‌పై మిడ్జిల్‌వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. వేముల గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో రాఘవేందర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైనట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించిన్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రాజాపూర్: మండలంంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం రైలు పట్టాల పక్కన 30–35 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు. వివరాలు.. మృతురాలు ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద జారిపడినట్లు ఉంది. మృతురాలు మెరూన్ కలర్ పంజాబీడ్రెస్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించింది. ఘటనపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్ అవాస్తవం

లింగాల: మండలంలోని క్యాంపు రాయవరం గ్రామానికి చెందిన పెరుమళ్ల నాగరాజు ఆదివారం కిడ్నాప్‌కు గురైనట్లు వచ్చిన వార్తలు అవాస్తమని పోలీసులు స్పష్టంచేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ సమీపంలోని మామిడి తోటలో నాగరాజు తన తల్లి హుస్సేనమ్మ, చిన్నాన్న నాగరాజుతో కలిసి ఉండగా.. నలుగురు వ్యక్తులు కారులో వచ్చి తీసుకెళ్లిపోయారు. అయితే అతడి ఫోన్ స్విచాఫ్ కావడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై అచ్చంపేట సీఐ రవీందర్ స్పందిస్తూ.. నాగరాజు కిడ్నాప్‌కు గురికాలేదని, నకిలీ ధ్రువపత్రాల తయారీ విషయంలో విచారణ నిమిత్తం జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులు తీసుకెళ్లారని స్పష్టం చేశారు. అతడితో ఫోన్‌లో మాట్లాడించడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రోత్సాహకం ఏది?



- కులాంతర వివాహం చేసుకున్న జంటలకు తప్పని ఎదురుచూపులు
- నాలుగేళ్లుగా నిధులను విడుదల చేయని ప్రభుత్వం
- బడ్జెట్ మేరకు అందిస్తున్నామంటున్న అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజంలో అంతరాలను తగ్గించేందుకు.. కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ఇస్తున్న ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. రూ. 50వేల నుంచి రూ. 2.50లక్షలకు పెంచుతూ 2019 నవంబర్ 1న ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా సమాజంలో కులాంతర వివాహాలపై అవగాహన పెరిగింది. ఇటువంటి పెళ్లిళ్లు చేసుకున్న జంటలను కొన్ని కుటుంబాలు తమతో కలుపుకుపోతున్నాయి. మరి కొందరు దూరం పెడుతున్నారు. అయితే కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వ ప్రోత్సాహకం సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

❐ మహబూబ్‌నగర్ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి దాక 115 జంటలు దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో కేవలం 30 జంటలకు మాత్రమే ప్రోత్సాహకం వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 85 మంది ప్రభుత్వ ప్రోత్సాహకం కోసం ఎదురుచూస్తున్నారు. సర్కారు మాత్రం నిధులను విడుదల చేయడం లేదు.

❐ నాగర్‌కర్నూల్ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 154 జంటలు దరఖాస్తు చేసుకోగా.. కేవలం 11 జంటలకు మాత్రమే ప్రభుత్వ ప్రోత్సాహకం అందింది. మరో 143 జంటలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

❐ నారాయణపేట జిల్లాలో 79 జంటలు దరఖాస్తు చేసుకోగా.. 34 జంటలకు మాత్రమే ప్రభుత్వ సాయం అందిందింది. మరో 45 జంటలు ప్రభుత్వ ప్రోత్సాహకం కోసం నిరీక్షిస్తున్నాయి.

అర్హులు వీరే..

- దంపతుల్లో ఒకరు తప్పనిసరిగా షెడ్యూల్డ్ కులానికి చెందినవారు, మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి.
- అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల పూర్తయి ఉండాలి.
- వివాహ చట్టం 1965 కింద నమోదై ఉండాలి.
- కొత్తగా పెళ్లయిన జంట వార్షిక ఆదాయం రూ. 5లక్షల కన్నా తక్కువగా ఉండాలి.
- మొదటి పెళ్లికి మాత్రమే ప్రోత్సాహకం అందుతుంది.
- వివాహమైన ఏడాదిలోపే జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

'కల్యాణలక్ష్మి' వైపు మొగ్గు..

జిల్లాలో కులాంతర వివాహాలు సాధారణమయ్యాయి. గతంలో ఒకే కులం అయితేనే పెళ్లి జరిపించే వారు. సంబంధాలు కలుపుకునే వారు. ఆ పట్టింపులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో అనేక కులాలు ఉన్నప్పటికీ.. అభిరుచులు, అభిప్రాయాలు కలిస్తే చాలు చాలా మంది పెద్దలను ఒప్పించి.. కులాంతర వివాహం చేసుకుంటున్నారు. ఒప్పుకోకుంటే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం కులాంతర వివాహాలు చేసుకునే వారికి గతంలో కేవలం రూ. 50వేలను ప్రోత్సాహకంగా అందించడం.. 2019లో రూ. 2.50 లక్షలకు పెంచినప్పటికీ సకాలంలో ప్రోత్సాహకం అందించకపోవడం వంటి కారణాలతో కులాంతర వివాహం చేసుకున్న జంటలు (పెద్దలు ఒప్పుకున్న వారు) కల్యాణలక్ష్మి పథకం వైపు మొగ్గు చూపుతున్నారు.

దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలు..

వేర్వేరు కులాలకు చెందిన స్త్రీ, పురుషులు వివాహం చేసుకుంటే.. పెళ్లికి సంబంధించిన ఆధారాలతో జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అధికారుల విచారణలో అర్హులుగా గుర్తిస్తే ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. తర్వాత సర్కారు నిధులు మంజూరు చేస్తుంది. వివాహం చేసుకున్న జంట మూడు ఫొటోలు, కుల ధ్రువపత్రాలు, వయసు ధ్రువీకరణకు విద్యా సంస్థలు ఇచ్చిన టీసీలు, మార్కుల మెమో, వివాహం చేయించిన అధికారి ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారి ద్వారా పొందిన ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్, వివాహం చేసుకున్న జంట కలిసి తీసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు, వివాహానికి సాక్షులుగా ఉన్నవారి వివరాలు, ఆదాయ ధ్రువపత్రం, ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

బడ్జెట్ మేరకు అందిస్తున్నాం..

కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాన్ని రూ. 50వేల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచింది. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకం అందిస్తున్నాం. మరో 85 జంటలకు అందించాల్సి ఉంది. తల్లిదండ్రుల మద్దతు లేకుండా పెళ్లి చేసుకున్న జంటలు ఈ డబ్బులతో జీవితంలో స్థిరపడే అవకాశం ఉంటుంది. దీనిపై అవగాహన కల్పించేందుకు మా శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం.

– సుదర్శన్, ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి

పెట్టుబడిదారుల చేతుల్లోనే దేశ సంపద

- పేదలకు ఉచిత విద్య అందకుండా కుట్రలు
- కేంద్రంపై సమష్టి పోరాటాలకు సిద్ధం కావాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

అమరచింత: దేశ సంపద ప్రజలందరి చేతికి వచ్చినప్పుడే పేదరికం అంతం అవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అమరచింతలో ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న దోరణిపై జాన్‌వెస్లీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇప్పటికీ దేశ సంపద మొత్తం కేవలం 200 మంది పెట్టుబడిదారుల చేతుల్లోనే ఉండటంతో ప్రజలు పేదరికంతో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రదేశాలకు ఆదిపత్యం వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు పొంతన లేకుండా ఉందన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తూ పేదల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశంలో ఉచిత విద్య లేకుండాపోతుందని.. దీన్ని అధిగమించాలంటే పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న సంపదపై కేవలం 4 శాతం పన్నులను వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో మత విద్వేషాలు రగిల్చి.. పేదలకు విద్య అందించకుండా కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెట్రేగిపోతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. దేశం, రాష్ట్రంలో ఉచిత పథకాల పేరిట పేదల సంపదను దోచుకున్నంత కాలం పేదలు పేదలుగానే మిగిలే పరిస్థితి ఉంటుందన్నారు. ఉచితాలను ప్రజలు వ్యతిరేకించి తమకు అందాల్సిన హక్కుల కోసం ప్రజాప్రతినిధులను నిలదీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు తలొగ్గే విధంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సమష్టి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉద్యమాలకు పుట్టినిల్లు.. అమరచింత

ఉద్యమాలకు పుట్టినిల్లు అమరచింత అని.. అలాంటి అమరచింతలో పుట్టడం తన అదృష్టమని జాన్‌వెస్లీ అన్నారు. విద్యార్థి దశలో వామపక్ష పార్టీ ఉద్యమం చూస్తూ ముందుకు వచ్చానన్నారు. తన కుటుంబంలో పుట్టిన సోదరులు సైతం పీడిత ప్రజల కోసం, పెత్తందారుల ఆగాడాలపై పోరాడుతున్న విషయాలను తెలుసుకుని వాటివైపు అడుగులు వేశానన్నారు. ఎన్నో నిర్బంధాలు ఎదురైనా ఇక్కడి తరం నాయకులు ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగానని వెల్లడించారు. రాష్ట్రంలో సీపీఎం పార్టీని బలోపేతం చేయడమే కాకుండా అమరచింత అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు జాన్‌వెస్లీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎస్ గోపి, మహమూద్, కిల్లె గోపాల్, జబ్బార్, పుట్ట ఆంజనేయులు, సాగర్, భూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, అయూబ్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి



కొత్తకోట రూరల్: వీధికుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన పెద్దమందడి మండలం అల్వాల గ్రామ శివారులోని పొలాల్లో ఆదివారం జరిగింది. స్థానిక రైతులు తెలిపిన వివరాలు.. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన దుప్పిని కుక్కలు వెంటపడి చంపినట్లు తెలిపారు. అనంతరం దుప్పి మృతి చెందిన విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మంజుల మృతి చెందిన దుప్పిని పరిశీలించారు. అనంతరం పెద్దమందడి పశువుల దవాఖానాలో దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల దాడిలోనే దుప్పి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సెక్షన్ ఆఫీసర్ నరేష్, బీట్ ఆఫీసర్ వంశీ, ఫారెస్ట్ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

15 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

వంగూరు: మండలంలోని తిరుమలగిరి వద్ద డీసీఎంలో నల్లబెల్లాన్ని తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి తిరుమలగిరితండాకు 15 క్వింటాళ్ల నల్లబెల్లంతోపాటు 50 కేజీల పట్టిక, 10కిలోల నాటుసారా పట్టుకున్నట్లు ఎస్‌టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి, ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. రమేష్, శ్రావణ్, లక్ష్మణ్‌ను అరెస్టు చేశారు. పట్టుకున్న బెల్లం వాహనాన్ని కల్వకుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి వారిని అభినందించారు.

వరిలో నల్లిని నివారిద్దాం

పాడి-పంట

అధికారి సలహా: సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరి పంటను ఈ మధ్యకాలంలో ఆకునల్లి, కంకినల్లి ఆశిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ చెప్పారు. ఈ నల్లులు కంటికి కనబడకుండా ఉండే చిరుజీవులు. పరిస్థితులు అనుకూలించనప్పుడు ఉధృతిని పెంచుకొని వరి పంటను నష్టపరుస్తాయి. రైతులు నల్లిని నివారించుకోవడానికి ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన వివరించారు.

నల్లులు ఆశించడానికి పరిస్థితులు..

- అధిక తేమ, ఉష్ణోగ్రతలు
- మబ్బులతో కూడిన వాతవరణం
- అధిక నత్రజని వాడకం

ఆకునల్లి : బూడిద తెలుపు రంగులో ఉండే నల్లి పురుగులు. ఆకుల వెనక భాగంలో, మధ్య ఈనల వెంబడి గుడ్లు పెడతాయి. ఒక్కొక్క ఆడ నల్లి 20– 80 గుడ్లను పెడుతుంది. నాలుగైదు రోజుల్లో గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటికి వస్తాయి. వీటి జీవితకాలం 9 నుంచి 13 రోజులు. ఈ నల్లి పురుగులు ఆకుల వెనక భాగం నుంచి రసాన్ని పీల్చివేయడంతో చిన్న చిన్న తెల్లటి మచ్చలు పొడవుగా కనిపిస్తాయి. వీటి ఉధృతి ఎక్కువైనప్పుడు తెల్ల మచ్చలన్నీ ఏకమై ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. దీనితో కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. మొక్కలు గిడసబారుతాయి.


నల్లి ఆశించడంతో ఆకుపై తెల్ల మచ్చలు

నివారణ ఇలా..

ఈ నల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ., లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగంలో తడిచేలా పిచికారీ చేయాలి.

కంకినల్లి : ఈ నల్లి తెలుపు రంగులో ఉంటుంది. గుంపులు, గుంపులుగా ఆకు తొడిమ పై భాగంలోని కణజాలంలో మధ్య ఈనల కింద భాగంలోని కణజాలంలో చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. తద్వారా మధ్య ఈనె నిలువుగా ఉదా రంగు చారలు తొడిమ మీద ఉదా రంగు మచ్చలు ఏర్పడతాయి. వీటి ఉధృతి పెరిగితే మచ్చల విస్తీర్ణం పెరుగుతుంది. కొన్ని సమయాల్లో ఆకులపై నుంచి రసాన్నీ పీల్చేయడంతో ఆకులపై పసుపు రంగు చారలు ఏర్పడుతాయి. వెన్ను అభివృద్ధి చెందే దశలో ఈ నల్లులు గింజలోకి చేరి అండాశయాన్ని, పుప్పొడిని ఆశించడంతో తాలుగా మారుతాయి. గింజలను వివిధ శిలీంద్రాలు ఆశించడంలో నల్లగా మారుతాయి. వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే వెన్ను సరిగా బయటకు వెలవడదు. ఖరీఫ్ వరిపై దీని ప్రభావం ఎక్కువ. ఒక్కొక్క ఆడ నల్లి 50 గుడ్లను పెడుతుంది. జీవిత కాలం 6 నుంచి 10 రోజులు బతుకుతుంది.


వరి ఆకుపై ఆశించిన నల్లి పురుగు

నివారణ చర్యలు ఇలా..

ప్రొఫినోఫాస్ 2.మి.లీ., డైకోఫాల్ 5 మి.లీ., డైపెంథిరాన్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పంట 40 – 45 రోజుల మధ్యలో తప్పనిసరిగా పిచికారి చేసుకోవాలి.

పోరాటంతోనే రాజ్యాధికారం సాధ్యం


సభావేదికపై ఐక్యత చాటుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ నాగర్‌కర్నూల్ రూరల్: సగర కులస్తులతోపాటు బీసీ వర్గాలకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీ గ్రౌండ్‌లో నిర్వహించిన 'సగర శంఖారావం' బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సగరులను బీసీ ఏ జాబితాలో చేర్చే విషయంపై మరోసారి చట్టసభల్లో చర్చించి, విశ్లేషించేందుకు కృషిచేస్తానని చెప్పారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ పోరాటంతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. బీసీల ఓట్లు బీసీలకే మళ్లించుకోవాలని, బీసీల్లోని ఇతర కులస్తులంతా బీసీ నేతలకు సహకరించాలని కోరారు. 2028 ఎన్నికల్లో బీసీలే అధికారాన్ని దక్కించుకోనున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇప్పటికే అన్ని కులాల్లో బీసీ నినాదం మార్మోగుతోందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలంతా ఓట్లు వేసుకుంటే, ఎవరినీ చేయిచాచి అడగాల్సిన పనిలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ అన్నారు. బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ ప్రజల చైతన్యంతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, ఇందుకోసం అందరూ చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సాగర్, ఆస్కాని మారుతిసాగర్, జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు, సంఘం నాయకులు అచనరపు వెంకటేశ్, వేముల సుధాకర్, పసగంటి రాజు తదితరులు పాల్గొన్నారు.


సభకు హాజరైన నేతలు

జలాశయం సామర్థ్యం తగ్గించాలి

- ఎర్రవల్లి గ్రామస్తుల డిమాండ్
- లేదంటే స్థానిక సంస్థలను ఎన్నికలను బహిష్కరిస్తాం

చారకొండ: డీఎల్ఐ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా మండలంలోని గోకారం చెరువును జలాశయంగా మార్చే ప్రక్రియలో భాగంగా జలాశయం సామర్థ్యం తగ్గించాలని రైతులు డిమాండ్ చేశారు. ఎర్రవల్లి గ్రామ రైతుల భూములు ముంపునకు గురికాకుండా జలాశయం సామర్థ్యం తగ్గించాలంటూ ఆదివారం గ్రామస్తులు ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని, లేదంటే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలి గ్రామం ముంపునకు గురికాకుండా చూడాలంటూ రాజకీయ పార్టీలకు హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటుచేశారు.


నిరసన తెలుపుతున్న ఎర్రవల్లి గ్రామస్తులు ప్రజలు

టెన్త్ బెటాలియన్‌లో.. హెడ్‌కానిస్టేబుల్ బలవన్మరణం


పవన్‌నాయుడు (ఫైల్)

ఎర్రవల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ హెడ్‌కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి టెన్త్ బెటాలియన్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ఏపీలోని నంద్యాల జిల్లా నందికొట్కూర్ మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన పవన్‌నాయుడు(35) బీచుపల్లి పదో పటాలంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొంతకాలంగా కుటుంబ సభ్యులతో తరుచుగా గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం పటాలంలోని క్వాటర్స్‌లో తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పవన్‌నాయుడుకు భార్యతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పవన్‌నాయుడు 2013లో పటాలం కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చేవాడు. అతని ఆకస్మిక మృతితో పదో పటాలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొత్తకోట రూరల్: అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పెద్దమందడి పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. చిలకటోనిపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి మూడు ట్రాక్టర్లు ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా శనివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు శివకృష్ణ, రాములు, జమ్ములు, యజమానులు భాజ జానకిరాములు, మూామిళ్ల రాములు, భాజ శ్రీనులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఇసుక, మట్టిని అనుమతులు లేకుండా తరలించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.


పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్